క్లుప్తంగా

స్కేటింగ్ రోల్ బాల్ పోటీల్లో విశాఖ రన్నరప్



రన్నరప్‌గా నిలిచిన విశాఖ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న మంత్రి రోజా(ఫైల్)

దాబాగార్డెన్స్: అండర్–17 స్కేటింగ్ రోల్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖపట్నం రన్నరప్‌గా నిలిచింది. తిరుపతిలో గత శని, ఆదివారాల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఫైనల్ పోటీ తిరుపతి–విశాఖపట్నం మధ్య జరిగింది. విజేతగా తిరుపతి, రన్నరప్‌గా విశాఖపట్నం నిలిచింది. మంత్రి రోజా నుంచి ట్రోఫీ అందుకున్నారు. మురళీనగర్ వైశాఖి స్కేటింగ్ పార్క్ కోచ్ సంతోష్‌కుమార్ నేతృత్వంలో విశాఖపట్నం టీం శిక్షణ పొందింది. ఈ నెల 31న కర్ణాటక రాష్ట్రం బెల్గాంలో జరగనున్న నేషనల్ పోటీలకు విశాఖపట్నం నుంచి సుద్విక్, దీక్షిత ఎంపికయ్యారు.

29న ఫుట్‌బాల్ శిక్షణకు ఎంపికలు

బీచ్ రోడ్డు: దాకమర్రిలోని కందుకూరి క్రికెట్ అకాడమీలో రెసిడెన్షియల్ అకాడమీలకు ఫుట్‌బాల్ శిక్షణతో కూడిన బోర్డింగ్ స్కూల్స్ ట్రయల్స్ ఈ నెల 29న నిర్వహించనున్నట్టు బైచుంగ్ భూటియా ఫుట్‌బాల్ పాఠశాల ప్రతినిధి కిషోర్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో ఫుట్‌బాల్ శిక్షణ ఎంపిక వివరాలను సోమవారం ఆయన విలేకరులకు వివరించారు. ఈ ట్రయల్స్ రెండు దశల్లో ఉంటాయన్నారు. క్రీడాకారులు ఐడీ కార్డుతో పాటు ఫుట్‌బాల్ కిట్‌లతో హాజరు కావాలన్నారు.వివరాల కోసం 75749 80867 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

రుణమేళాతో ఖాతాదారులకు సౌలభ్యం



లబ్ధిదారునికి కారు నమూనా కీ అందజేస్తున్న బ్యాంకు అధికారులు

దాబాగార్డెన్స్: రుణమేళాతో ఖాతాదారులకు సౌలభ్యం చేకూరుతుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెంట్రల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ ఎస్‌కే మహాపాత్రో అన్నారు. విశాఖ విచ్చేసిన ఆయన దాబాగార్డెన్స్‌లోని బ్యాంక్ మెయిన్ బ్రాంచ్‌లో పలువురు ఖాతాదారులకు ఫీల్డ్ జీఎం కేఎస్‌డీఎస్ వరప్రసాద్, రీజనల్ హెడ్ కె.నటరాజ్, బ్రాంచ్ సీజీఎం నాయుడుతో కలిసి రుణాలు అందజేశారు. మహాపాత్రో మాట్లాడుతూ రుణమేళా ద్వారా ఖాతాదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. రూ.205 కోట్లను వివిధ రుణాల కింద ఖాతాదారులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రతీ వారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అన్ని శాఖల్లో రుణమేళా ఉంటుందని, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

సంజీవని రిలీఫ్ ఫండ్‌కు రూ.25 వేలు విరాళం



కలెక్టర్ మల్లికార్జునకు రూ.25 వేలు చెక్కు అందిస్తున్న జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి

మహారాణిపేట(విశాఖ దక్షిణ): సంజీవని జిల్లా రిలీఫ్ ఫండ్‌కు రూ.25 వేలు చెక్కును కలెక్టర్ డా ఎ.మల్లికార్జునకు జిల్లా పరిషత్ కార్యాలయం తరఫున సీఈవో శ్రీరామమూర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



102 నమూనా అగ్నిగుండాలతో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు



వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ అలంకరణ

- ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం
- మహిళల సామూహిక అర్చనలు
- 102 రకాల ప్రసాదాల నివేదన



102 రకాల ప్రసాదాల నివేదన
102 పువ్వుల బుట్టల సమర్పణ

దాబాగార్డెన్స్: వాసవీమాత అగ్నిగుండంలో ఆత్మాహుతి చేసుకునే ఘట్టాన్ని స్మరిస్తూ 102మంది ముత్తయిదువలతో, 102 నమూనా అగ్నిగుండాలను ఏర్పాటు చేసి, 102 దీపాలతో వాసవీమాత ఆలయ ప్రాంగణంలో వాసవీ క్లబ్ సౌజన్యంతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి 102 రకాల ప్రసాదాలను నివేదించి, 102 పూలబుట్టలను సమర్పించారు.

వన్‌టౌన్ ప్రాంతం కురుపాం మార్కెట్ సమీపాన గల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి దేవాలయం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ కల్యాణ మండపం, వాసవీ విజ్ఞాన మండలితో పాటు నగరంలోని వివిధ వాసవీ క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిపించారు. ధర్మరక్షణ కోసం 1013 సంవత్సరాల క్రితం వైశ్యజాతిని జాగృతపరిచి, 102మంది ఆర్యవైశ్య దంపతులను అగ్నిగుండంలోని నడిపించిన మాఘ శుద్ధ విదియ రోజు ఏటా ఆత్మార్పణ దినోత్సవంగా వైశ్యులు నిర్వహిస్తారని దేవాలయ కమిటీ అధ్యక్షుడు అరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా వేకువజామున 3 గంటలకు అమ్మవారికి క్షీరాభిషేకం చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. స్వర్ణ పుష్పార్చన అనంతరం వాసవీ హోమం జరిపించారు. మహిళలు సహస్రనామ పారాయణం చేశారు. ఉత్సవమూర్తికి భక్తులు క్షీరాభిషేకం చేశారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజల అనంతరం నారాయణ సేవ జరిపారు. కార్యక్రమంలో దేవాలయ కోశాధికారి సుగ్గు శివకుమార్, చెక్క చందన, జీవీఆర్ కుమార్, ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్ శర్మ, కందుల నాగరాజు, నల్లూరి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు అప్పగింత



విక్రమ్ (మెరూన్ కలర్ షర్టు)ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ రేవతి, మమత

అల్లిపురం: మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో, తప్పిపోయి ఊరుగాని ఊరు వచ్చిన వ్యక్తిని ఓ ట్రస్ట్ ప్రతినిధులు చేరదీసి, చికిత్స అనంతరం వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమత తెలిపిన వివరాలివి.. ఈ నెల 10వ తేదీన మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న విక్రమ్‌ను వన్‌టౌన్ పోలీసులు గుర్తించి, మమత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మమతకు సమాచారం అందజేశారు. ఆమె అతడిని చినవాల్తేరులోని మానసిక చికిత్సాలయంలో చేర్పించారు. వైద్యుల చికిత్సతో ఆ వ్యక్తి కోలుకున్నారు. దీంతో మమత వివరాలపై ఆరా తీయగా, అతనిది ఒడిశా అని, భార్యా, పిల్లలు ఉన్నారని తెలిసింది. వెంటనే ఒడిశాలోని అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా.. విక్రమ్ సోదరుడు నాగేశ్వర్ గురు, బావమరిది సురేష్ చంద్ర నాయక్ సోమవారం వచ్చారు. దీంతో విక్రమ్‌ను వన్‌టౌన్ సీఐ రేవతి సమక్షంలో బంధువులకు అప్పగించారు. తప్పిపోయాడనుకున్న వ్యక్తిని రక్షించి, చికిత్స అందించి తమకు అప్పగించిన పోలీసులకు, ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమతకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

సమాచారమ్

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖవాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

పేదల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- 31వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజలకు లబ్ధి పొందిన వివరాలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



దోశలు వేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: పేద ప్రజల అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం 31వ వార్డు 1086213 డ్వాక్రా బజార్ సచివాలయ పరిధిలో నిర్వహించారు. ప్రభుత్వ పాలన ఎలా ఉంది తల్లీ.. అంటూ ప్రభుత్వం నుంచి లబ్ధి పొందుతున్న ప్రజల ఇళ్లకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అమలు తీరు, సచివాలయ వ్యవస్థ పనితీరు, పెన్షన్ల అమలు ప్రక్రియ ఎలా సాగుతుందో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏవైనా పథకాలు అమలు కావాలంటే ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రతి వార్డులో చెబుతున్నారన్నారు. ప్రస్తుతం కేవలం అర్హతే ప్రామాణికంగా పథకాలు మంజూరు అవుతున్నట్టు ఆయన చెప్పారు. పార్టీలు, కులాలు, మతాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 31 లక్షల మందికి జగనన్న ఇళ్ల స్థలాలు కేటాయించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. మరో 30 ఏళ్లు సీఎంగా జగన్‌నే రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని, ఆదర్శ సీఎంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, డీఈఈ వెంకటేష్, వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, పార్టీ నాయకులు బత్తిన నవీన్‌కుమార్, దొడ్డి బాపూ ఆనంద్, ధనలక్ష్మి, భవాని, రాంబాబు, మొకర గోపి, పల్లా శ్రీనివాస్, గంటా శ్రీనివాస్, రాము మాస్టారు, దండి వెంకటేష్, నక్కా వేణుగోపాల్, లక్ష్మణ్, రాజేష్, రమణ, మాసిపోగు రాజు, లండా రమణ, ఆదివిష్ణు, కడియం ప్రసాద్, బోని దేవా, కిషోర్, సాగర్, సచివాలయ సిబ్బంది, వాటర్ సప్లై ఏఈ రవికుమార్, ఎలక్ట్రికల్ ఏఈ అన్నంనాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్య, తదితరులు పాల్గొన్నారు.

కర్బన ఉద్గారాలు తగ్గించాలి



ప్రసంగిస్తున్న హెచ్‌పీసీఎల్ ఈడీ రతన్‌రాజ్

ఏయూ క్యాంపస్: కర్బన ఉద్గారాలను తగ్గిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి జరగాలని హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్‌రాజ్ అన్నారు. సోమవారం ఉదయం ఐఐపీఈ ప్రాంగణంలో 'టెక్నాలజీ ఫర్ అప్‌బేట్‌మెంట్ ఆఫ్ ప్రీ, పోస్ట్ కార్బన్ ఎమిషన్స్'మూడు రోజుల సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, రిఫైనరీల నుంచి కర్బన ఉద్గారాలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో చేపట్టే గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ ప్రత్యేకతలు తెలియజేశారు. కార్బన్ న్యూట్రాలిటీ సాధించే దిశగా హెచ్‌పీసీఎల్ చర్యలు చేపడుతున్న విధానం వివరించారు. బ్లూ హైడ్రోజన్ కోసం చేపడుతున్న పైలట్ ప్రాజెక్టులు వంటివి తెలియజేశారు. ఐఐపీఈ సంచాలకుడు ఆచార్య శాలివాహన్ మాట్లాడుతూ పరిశోధన సంస్థగా మెరుగైన సమాజం కోసం ఐఐపీఈ కృషి చేస్తోందన్నారు. కర్బన ఉద్గారాల నియంత్రణకు అవసరమైన నవ్య ఆవిష్కరణలు చేయాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రవి కిరణ్, శ్రీధర్ పల్లా, హేమంత్ కుమార్ తన్నేరు, 60 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

8,9 తేదీల్లో కృత్రిమ చేతుల అమరిక శిబిరం

అల్లిపురం: ఇనాలి ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం, సెంట్రల్ క్లబ్ ఆఫ్ పూనా డౌన్‌టౌన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8,9 తేదీల్లో బ్యాటరీతో పని చేసే కృత్రిమ చేతుల అమరిక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో రోటరీ సభ్యులు పి.బాలసతీష్, లావణ్య ముష్టి అల్తాఫ్ మాబ్, రోహిత్ వివరాలు వెల్లడించారు. మణికట్టుకు పైన, లేదా కింద 5 అంగుళాలు మేర చేయి ఉన్నవారు మాత్రమే ఈ ప్రొస్థెటిక్ బ్యాటరీ ఆపరేటెడ్ హ్యాండ్ ఏర్పాటుకు అర్హులని తెలిపారు. కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డుతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోను 7795137999, 7659024247 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. అర్హులైన వారందరికీ ఫిబ్రవరి 8,9 తేదీలలో రైల్వే న్యూకాలనీ, మెయిన్‌రోడ్డులోని ఐటీసీ పెట్రోల్‌బంక్ వద్ద గల కౌన్సిల్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, విశాఖ సేఫ్టీలో ఫిట్‌మెంట్ శిక్షణ ఇస్తారని తెలియజేశారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

విశాఖ లీగల్ : మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవనంలో మహిళా చట్టాలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ నిర్ధారణ నిషేధిత చట్టం–1994పై ఆయన మాట్లాడారు. సమాజంలో ఆడ, మగ ఇద్దరు సమానమేనన్న విషయాన్ని కార్యకర్తలు ప్రచారం చేయాలన్నారు. వివాహితులు తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కౌన్సిలర్ అనిజాకుమారి, సీనియర్ న్యాయవాది సుధ, అంగన్‌వాడీ టీచర్లు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు అందజేస్తున్న నవీన్‌కుమార్

దాబాగార్డెన్స్: అన్నార్తులకు ఆహారం అందించడం ఎంతో సంతృప్తినిస్తుందని వైఎస్సార్‌సీపీ 31వ వార్డు నాయకుడు బత్తిన నవీన్‌కుమార్ అన్నారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్, స్టేషన్‌రోడ్డు, న్యూకాలనీ తదితర ప్రాంతాల్లోని నిరాశ్రయులకు సోమవారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ శంకర్రావు, రాజేష్, కొల్లి లక్ష్మణరావు, నక్క వేణుగోపాల్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్లలో మొక్కల సంరక్షణకు కృషి



మాల్ వద్ద ఉన్న డివైడర్లలో మొక్కలను పరిశీలిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: నగర సుందరీకరణ కోసం ప్రధాన రహదారుల్లో డివైడర్ల మధ్య వేసిన మొక్కల సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని హార్టికల్చర్ అధికారులకు జోన్–4 కమిషనర్ శివప్రసాద్ సూచించారు. సోమవారం జోన్ పరిధిలో బీచ్ రోడ్డు, వైజాగ్ సెంట్రల్ మాల్, తదితర ప్రధాన రహదారుల్లో ఆయన పర్యటించారు. ఎప్పటికప్పుడు మొక్కలను నీళ్లుపోయడం, ఏపుగా పెరిగిన మొక్కలను కట్ చేయడం చేయాలన్నారు. డివైడర్లలో పెరగని మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. అనంతరం వార్డుల్లో గెడ్డలు, కల్వర్టులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత సుభాష్ చంద్రబోస్



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చంద్రబోస్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నూకరాజు



అల్లిపురం గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి పీవీఎన్ రాజు, తదితరులు

అల్లిపురం: సాయుధ పోరాటం ద్వారానే ఆంగ్లేయులను భారతదేశం నుంచి తరిమికొట్టవచ్చని నమ్మిన వ్యక్తి స్వాతంత్య్ర సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ అని అల్లిపురం శాఖా గ్రంథాలయం అధికారి పీవీఎస్ రాజు అన్నారు. సుభాష్ చంద్రబోస్ 126వ జయంతిని సోమవారం అల్లిపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హింద్‌ఫౌజ్‌ను స్థాపించి రాజీలేని పోరాటం చేశారన్నారు. ఆయన పట్టుదలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, సలీం, పాఠకులు కె.ప్రసాద్, టి.సత్యనారాయణ, డి.ఇంద్రసేనారెడ్డి, జయలక్ష్మి, శివ, తదితరులు పాల్గొన్నారు.

దాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. చంద్రబోస్ చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ అధికారి పీవీ నూకరాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సమావేశ మందిరంలో..

మహారాణిపేట: సుభాష్ చంద్రబోస్ దేశానికి చేసిన సేవలు మరువలేమని జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్య నిర్వహణాధికారి డి.సత్యనారాయణ అన్నారు. నేతాజీ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నేతాజీ జయంతి నిర్వహించారు. కళాశాల తెలుగు, చరిత్ర విభాగాలు, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు, నెహ్రూ యువజన కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, కెన్ ఫౌండేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పి. సంతోష్ తదితరులు ప్రసంగించారు. మాతృభూమి స్వేచ్ఛ కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహనీయుడని కొనియాడారు. నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌వైకే జిల్లా అధికారి జి. మహేశ్వరరావు, కళాశాల ఏజీవో డాక్టర్ కె.సుధ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు డాక్టర్ ఏడీ పుష్పలత, ఎన్‌వీ పద్మకుమారి, సీహెచ్ తేజస్విని, ఎస్.అనురాధ, తెలుగు అధ్యాపకురాలు బి.రాధమ్మ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నరనరాల్లో దేశభక్తి నింపిన నేత

మహారాణిపేట: అజాద్ హింద్‌ఫౌజ్‌ను స్థాపించి, ప్రజల నరనరాల్లో దేశభక్తిని నింపిన నేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని డాక్టర్ లక్ష్మీ నారాయణ అన్నారు. మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయంలో శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నేతాజీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, ఎస్.మహేష్, ఎస్.చాతుర్య, క్షీరాబ్ధి దుతి, గేదెల శ్రీహరి, శ్రీనివాస్, డాక్టర్ వై.లక్ష్మణరావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మహిళా డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న సంతోష్



నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రవికుమార్

వైద్య విద్యార్థిని బిందు మౌనికకు స్వర్ణ పతకం



బిందు మౌనికకు బంగారు పతకం అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: యూనివర్సిటీ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన వైద్యవిద్యార్థిని బి.బిందు మౌనికకు 2022 సంవత్సరానికి గాను బంగారుపతకం లభించింది. గైనకాలజిస్ట్‌గా, సూపరింటెండెంట్‌గా విశేష సేవలు అందించిన దివంగత ప్రొఫెసర్ కె.శారదాబాయి స్మారకంగా ప్రకటించిన ఈ గోల్డ్‌మెడల్‌ను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మౌనికకు అందజేశారు. ప్రతీ సంవత్సరం అత్యుత్తమ మార్కులు సాధించిన అవుట్‌గోయింగ్ స్టూడెంట్‌కు పతకాన్ని అందించేందుకు కార్పస్‌ఫండ్‌గా ఐదు లక్షల రూపాయలను అందించిన ప్రొఫెసర్ మధుసూదన్‌బాబును అభినందించారు. శారదాబాయి జీవిత విశేషాలను, ఆమె అందించిన సేవలను ప్రొఫెసర్ కె.వి.ఎస్.సంధ్యాదేవి సభలో ప్రెజెంట్ చేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్, మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.మధుసూదన్ బాబు, ఇతర విభాగాల అధ్యాపకులు, డాక్టర్ బిందు మౌనిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా యాసిన్‌బాబా ఉరుసు

దాబాగార్డెన్స్: యాసిన్ బాబా ఉరుసు వేడుక సోమవారం ఘనంగా జరిగింది. పాతనగరం కంచరవీధిలో గల యాసిన్‌బాబా దర్గా నుంచి పెద్ద ఎత్తున చాదర్ ఊరేగింపు నిర్వహించారు. కంచరవీధిలో ప్రారంభమైన ఊరేగింపు టౌన్‌కొత్తరోడ్డు, కురుపాం మార్కెట్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, పాతపోస్టాఫీస్, కోటవీధి మీదుగా తిరిగి టౌన్‌కొత్తరోడ్డు, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజ్ రోడ్డు నుంచి కంచరవీధి వరకు సాగింది. ఊరేగింపులో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. డప్పులు వాయిస్తూ ఒంటెలు, గుర్రాలతో సంబరంలో పాల్గొన్నారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహా కార్యక్రమం నిర్వహించారు.

టాస్క్‌ఫోర్స్ వాహనాలతో మరింత పరిశుభ్రత

జగదాంబ: టాస్క్‌ఫోర్సు వాహనాల ద్వారా పరిశుభ్రతకు జీవీఎంసీ పెద్దపీట వేసిందని జోన్–4 అడిషనల్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.కిశోర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అన్ని వార్డుల్లో ఉదయం నుంచి 10 గంటల వరకు పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణ చేస్తున్నారన్నారు. అయితే ఆ తరువాత వేస్తున్న చెత్తను కూడా పరిశుభ్రం చేయడానికి ఈ టాస్క్‌ఫోర్సు వాహనాలు ఏర్పాటు చేశారన్నారు. జోన్–4 పరిధిలో మొత్తం 42 వాహనాలు కేటాయించారని చెప్పారు. ఈ వాహనాలు ఉదయం 10 గంటల తరువాత వార్డుల్లోకి వస్తాయన్నారు.

ఎట్టకేలకు రహదారి నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్..



పూర్ణామార్కెట్ వద్ద వేసిన రహదారి

జగదాంబ: ఎట్టకేలకు పూర్ణామార్కెట్ ప్రధాన రహదారి నిర్మాణం పూర్తయింది. నగరంలో నాడు–నేడు కింద జీవీఎంసీ రహదారులన్నీ నిర్మాణం చేపట్టి, పూర్ణామార్కెట్ రోడ్డును వదిలివేశారు. దీంతో రోడ్డు వేయండి మహాప్రభో శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు స్పందించి జీవీఎంసీ అధికారులతో మాట్లాడారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు పనులు చేపట్టి రెండు రోజుల్లో పూర్తి చేశారు. ముందుగా రామకృష్ణ జంక్షన్ నుంచి ప్రారంభించారు. రెండో రోజు పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిపై నిర్మాణం చేయడంతో వ్యాపారులు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.